సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 27 । ఏప్రిల్ । 2023



ప్రభుత్వ పథకాలు అందించాలి

ప్రభుత్వ పథకాలు మైనార్టీలకు అందేలా చూడాలని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది అన్నారు.

- 8లో



కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం

కార్యకర్తలే బీఆర్‌ఎస్ పార్టీకి బలం, బలగమని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
37° / 24°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల భవిష్యత్‌కు నూతన విద్యావిధానం



మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

భువనగిరి: విద్యార్థుల ఉపాధి కల్పన కోసం జాతీయ నూతన విద్యా విధానం దోహదపడు తుందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నూతన జాతీయ విద్యా విధానంపై సెమినార్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యావిధానంలో మార్పులు రావాల్సిన అవస రముందన్నారు. అనంతరం నూతన జాతీయ విద్యా విధానానికి సంబంధించిన సంచికను విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్ర టరీ సీహెచ్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మసీదుస్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్లపై అవగాహన

భువనగిరి: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఆరుగురికి వేసెక్టమీ ఆపరేషన్లు నిర్వహించినట్లు డీఎంహె చ్‌ఓ మల్లికార్జున్‌రావు బుధవారం తెలిపారు. అనంతరం ఆపరేషన్లపై అవగాహన కల్పించి నట్లు పేర్కొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ

ఆత్మకూరు(ఎం): రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ధాన్యం కొనుగోళ్లు చేప ట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అను రాధ అన్నారు. బుధవారం ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. కొరటికల్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు నష్ట పోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. జిల్లా అధికారులతో మాట్లాడి పంట నష్ట పరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆమె వెంట ఆలేరు ఏడీఏ వెంకటేశ్వరరావు, ఏఈఓ కావ్య తదితరులున్నారు.

జిల్లా స్థాయి క్లస్టర్ సమావేశం

భువనగిరి: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాల యంలో బుధవారం జిల్లా స్థాయి క్లస్టర్ లెవల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి, ఆత్మకూర్(ఎం) మండలాలకు సం బంధించిన ఉపాధి హామీ పథకం, పల్లె ప్రగతి, క్రీడా ప్రాంగణాలు, గ్రామ పంచాయతీల విద్యుత్ చార్జీలు, నీటి సరఫరా, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశం లో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఓ మందడి ఉపేందర్‌రెడ్డి, ఏపీడీ శ్యామల, భువనగిరి ఎం పీడీఓ నరేందర్‌రెడ్డి, ఏపీఓ, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

భువనగిరిటౌన్: అకాల వర్షంతో పంట నష్టపో యిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీ ఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరిలోని సుంద రయ్య భవన్‌లో నిర్వహించిన సీపీఎం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి నష్టపో యిన రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు నర్సింహ, బాలరాజు, స్వామి, కృష్ణ, యాదగిరి, రాజు, రాములమ్మ, శ్రీశైలం, రాజు ఉన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి క్షేత్రంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు సంప్రదాయ పూజలు కొన సాగాయి. శ్రీస్వామివారికి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన జరిపించారు. ఇక ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్య కల్యాణం, తిరువీధి జోడు సేవలు చేపట్టారు. అనంతరం రాత్రి పవళింపు సేవ నిర్వహించి, ఆలయాన్ని మూసి వేశారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి రూ.14,67,354 నిత్య ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

రైతుకు అపార నష్టం

భారీ వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం

- కొనుగోలు కేంద్రాల్లో వరదకు కొట్టుకుపోయిన వడ్లు
- రాశుల కిందకు నీరు చేరడంతో మొలకెత్తుతున్న వైనం
- నేలవారిన వరి చేలు
- జిల్లావ్యాప్తంగా 10,795 ఎకరాల్లో పంట నష్టం



భువనగిరి పట్టణంలోని మార్కెట్‌యార్డులో వరద నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం



ఈ ఫొటోలోని మహిళా రైతు ఆత్మకూర్(ఎం) మండలం రహీంఖాన్‌పేట గ్రామానికి చెం దిన కర్రె జయమ్మ. వారం రోజుల క్రితం సుమారు 60 బస్తాల ధాన్యాన్ని రహీంఖాన్‌పేట గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో అమ్మకానికి తీసుకువచ్చి బండ మీద ఆరబోసింది. మంగళవారం సాయంత్రం ఇంటికి వెళ్లే ముందు ఆరబోసిన ధాన్యాన్ని తిరిగి కుప్పగా చేయలేదు. దీంతో రాత్రి కురిసిన వర్షానికి 20 బస్తాల వడ్లు కొట్టుకుపోయి బండ కింద చెరువులో చేరాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చెరువులో అందినకాడికి ధాన్యాన్ని సేకరించగా నాలుగు బస్తాల వరకు చేతికందింది. మిగతా 16 బస్తాల ధాన్యం నష్టపోయింది.



వలిగొండ మండలం నాతాళ్లగూడెం వద్ద నేలకొరిగిన వరిచేను

సాక్షి, యాదాద్రి: జిల్లాలో మంగళ వారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీం తో కోతకు వచ్చిన వరి చేలు నేల వాలాయి. కల్లాల్లో ధాన్యం కొట్టుకు పోవడంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కొను గోలు కేంద్రాలు ఏర్పాటులో తీవ్ర జాప్యం, దీనికితోడు అకాల వర్షాలు రావడంతో రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారు. మంగళవారం కురిసిన వర్షానికి 345 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. కొనుగోలు కేం ద్రాల్లో రైతులు అమ్మకానికి తెచ్చి ఆరబోసిన ధాన్యం ట్రాక్టర్ల కొద్దీ కొట్టుకుపోయింది. వడ్ల రాశుల కిందకి వర్షపు నీరు చేరడంతో మొలకెత్తుతు న్నాయి. కాగా.. ఇప్పటివరకు కురిసిన అకాల వర్షా లకు జిల్లావ్యాప్తంగా 10,795 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు.

మంగళవారం కురిసిన వర్షానికి నష్టం ఇలా.. (ఎకరాల్లో)	
చౌటుప్పల్ 55	పోచంపల్లి 200
మోత్కూర్ 50	అడ్డగూడురు 40

నేలవాలిన వరి చేలు

అకాల వర్షంతో కోత దశలో ఉన్న పంట చేలు నేల వాలాయి. పోచంపల్లి, వలిగొండ, అడ్డగూడూరు, భువనగిరి పట్టణం, యాద గిరిగుట్ట, రాజాపేట, ఆలేరు మండలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి ధాన్యం నేలరాలింది. రేపో మాపో కోయడానికి సిద్ధంగా ఉన్న పంట పొలం దెబ్బతినడం తో రైతులు ఆందోళన చెం దుతున్నారు. అదేవిధంగా తుర్కపల్లి, భువనగిరి, మోటకొండూరు వలిగొండ మండలాల్లో సుమారు 100 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి.

సకాలంలో స్పందించని యంత్రాంగం

ధాన్యం నెల రోజుల నుంచి కేంద్రాలకు వస్తున్నా కొనుగోళ్లు మాత్రం ప్రారంభం కాలేదు. జిల్లాలో 317కు పైగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధ మైనా అధికారులు ఇప్పటివరకు 70 కేంద్రాలను మొక్కుబడిగా ప్రారంభించారు. సకాలంలో కొను గోళ్లు ప్రారంభమైతే రైతులు తెచ్చిన ధాన్యం అమ్ము కునేవారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపో వడం, మొక్కుబడిగా ప్రారంభించినా కొనుగోళ్లు జరపకపోవడంతో అకాల వర్షాలతో రైతులు తీవ్రం గా నష్టపోయారు. కేంద్రాల్లో వరి ధాన్యంపై కప్పడా నికి సరిపోను టార్పాలిన్లు లేకపోవడం, రైతులు అద్దెకు తెచ్చి కప్పిన కవర్లు ఈదురు గాలులకు లేచిపోవడంతో ధాన్యం తడిసి ముద్దయింది.

వరద నీటికి కొట్టుకుపోయిన ధాన్యం

భువనగిరి, వలిగొండ, మోత్కూరు, ఆలేరు లోని మార్కెట్ యార్డుల్లోని ధాన్యం, జిల్లా వ్యాప్తంగా ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేం ద్రాల్లో అమ్మకానికి తెచ్చిన ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. ఒక్కసారిగా సాయంత్రం ఈదురు గాలులతో వచ్చిన వర్షం కొనుగోలు కేంద్రాల్లోని రైతులను అత లాకుతలం చేసింది. బుధవారం ఉదయం తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడం, కుప్పగా పోయడానికి శ్రమించారు. కాగా.. గుండాల, మోత్కూరులో ధాన్యం మొలకెత్తింది.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



నాకున్న 12 ఎకరాల వరి సాగులో 9 ఎకరాల్లోని ధాన్యం కొనుగోలు కేం ద్రానికి తీసుకువచ్చాను. రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం రాశులు తడిసి నీటిలో కొట్టుకుపోయాయి. ఇంకా మిగిలిన వరి చేను వర్షానికి నెలకొరిగింది. ధాన్యం తడిసి నష్టపోయాం. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలి.

– మోటే సాయిలు, నాతాళ్లగూడెం, వలిగొండ మండలం

పది బస్తాల ధాన్యం కొట్టుకుపోయింది



మా గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం లో 100 బస్తాల ధాన్యం పోసాను. కొనుగోలు కేం ద్రం వద్ద ఉన్న దేవునిబం డపై రెండు ధాన్యపు రాశులు పోశా. ఈదురు గాలికి కప్పిన పట్టాలు లేచిపోయాయి. వర్షం పడడంతో వరదకు సుమారు 10 బస్తాలకు పైగా ధాన్యం కొట్టుకుపోయి చెంతనే ఉన్న చెరువు అలుగు, కంపచెట్లల్లోకి చేరింది.

– భీమనబోయిన పెద్ద కొమరయ్య, దాచారం గ్రామం

100 బస్తాల ధాన్యం తడిసింది



మాకు 8 ఎకరాలు ఉండగా.. 4 ఎకరాల్లో వరి సాగు చేశా. ఎక రానికి సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టాం. వారం రోజుల క్రితం నాలుగు ట్రాక్టర్ల ధాన్యాన్ని భువనగిరి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాం. ప్రతి రోజు కేంద్రానికి వెళ్లి ధాన్యాన్ని ఆరబోస్తున్నాం. కేం ద్రాన్ని ప్రారంభించారు. కానీ ధాన్యం కొనుగోలు చేయలేదు. వర్షంతో 100 బస్తాల ధాన్యం తడిసింది.

– బండి వెంకటేశం, బొమ్మాయిపల్లి గ్రామం, భువనగిరి

చిన్నారుల ఆరోగ్యానికి భరోసా

- నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో నిరంతర వైద్యసేవలు
- పూర్తిస్థాయిలో వైద్యుల నియామకం
- 10 పడకలతో ఆధునీకరణ



నవ జాత శిశు సంరక్షణ కేంద్రంలో చిన్నారులు

భువనగిరి: జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో పిల్లలకు నిరంతర వైద్యసేవలు అందుతున్నాయి. దీంతో పిల్లల వైద్యానికి భరోసా లభిస్తోంది. ఒకప్పుడు చిన్నారులకు ఏమైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే స్థానిక ప్రైవేట్ ఆస్ప త్రులను ఆశ్రయించేవారు. లేదంటే హైదరాబాద్‌కు తీసుకెళ్లేవారు. దూరభారంతో పాటు నిరుపేదలకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడేవి. తీవ్ర అనారోగ్యం బారిన పడిన చిన్నారులకు సకాలంలో మెరుగైన చికిత్స అందక మృత్యువాత పడిన సంఘటనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2022 మే 20న రూ.45 లక్షలతో ఆధునీకరించిన నవజాత శిశువు సంరక్షణ కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి నెల రోజుల వయసు గల చిన్నారులకు ఈ కేంద్రం లో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో నెలకు 70 నుంచి 90 మందికి పైగా చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆధునీకరించిన నవ జాత శిశు సంరక్షణ కేంద్రంలో 10 పడకలు ఏర్పాటు చేశారు. 13 పడకలతో పిల్లల ప్రత్యేక వార్డు ఉండగా.. నెల రోజుల పిల్లల నుంచి 14 సం వత్సరాల వయసు గల వారికి అత్యవసర, మెరు గైన వైద్యసేవలు అందు బాటులో ఉన్నాయి.

పూర్తిస్థాయిలో వైద్యులు

నవజాత శిశు సంరక్షణ కేం ద్రంలో ప్రస్తుతం పూర్తి స్థాయిలో ఇద్దరు పీడియాట్రిక్ వైద్యులను నియ మించారు. వీరితో పాటు ఏడుగురు నర్సులు, నలుగురు వైద్యేతర సిబ్బందిని నియమించారు. గతంలో ఆస్పత్రికి సంబంధించిన వైద్యులతోనే చిన్నారులకు వైద్య సేవలందించేలా చర్యలు తీసు కున్నారు. ప్రస్తుతం కేంద్రా నికి సరిపడా వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేయడం తో పిల్లలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలందుతున్నాయి.

అనారోగ్య సమస్యలపై..

ఆస్పత్రిలో తలసేమియా వ్యాధిగ్రస్తులైన పిల్లలకు రక్తం ఎక్కించడం, న్యుమో నియా, మూర్ఛ, కాలిన గాయాలు, పౌష్టికాహార లోపం, బరువు తక్కువగా ఉండటం వంటి సమస్య లు వచ్చిన పిల్లలకు అత్యాధునిక సౌకర్యాలతో వైద్య సేవలందిస్తున్నారు.

వైద్యసేవల వివరాలు

నెల	ఇన్‌పేషెంట్	అవుట్ పేషెంట్
జనవరి	94	01
ఫిబ్రవరి	77	02
మార్చి	93	01

పిల్లల వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ



ఆధునీకరించిన నవజాత శిశువు సంరక్షణ కేంద్రంలో సకల సౌకర్యాలలో పిల్లలకు వైద్య సేవలంది స్తున్నాం. ఇటీవల కేంద్రా నికి పూర్తి స్థాయిలో వైద్యు లతో పాటు సిబ్బందిని ఏర్పాటు చేశాం. నవ జాత శిశువు సంరక్షణ కేంద్రంతో పాటు పిల్లల వార్డులో నిరంతరం వైద్య సేవలందించే విధం గా చర్యలు తీసుకుంటున్నాం. ఆస్పత్రిలో పిల్లలకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– చిన్ననాయక్, డీసీహెచ్‌ఎస్

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



ధాన్యాన్ని తూకం వేస్తున్న గొంగిడి సునీత

తుర్కపల్లి: రైతులు పండించిన ప్రతి ధాన్యం గిం జనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. మంగళవారం తుర్క పల్లి మండలంలోని దత్తాయపల్లి, వెంకటాపూర్, పెద్దతండలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పండిన పంట డిమాండ్ ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో దాదాపు 70 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్య సుశీలరవీందర్ నాయక్, జెడ్పీ వైస్‌చైర్మన్ బీకునాయక్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పిన్న పురెడ్డి నరేందర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మం డల అధ్యక్షుడు కొమ్మిరిశెట్టి నర్సింహులు, ఎంపీటీ సీ సభ్యులు గిద్దె కరుణాకర్, మోహన్‌బాబ ునాయక్, సర్పంచ్‌లు రాంమోహన్‌శర్మ, కల్లూరి ప్రభాకర్‌రెడ్డి, బాబునాయక్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ముత్యాలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

రాజాపేట: రైతుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభు త్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. బుధవారం రాజాపేట మండలంలోని పుట్టగూడెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాల మణి, పీఏసీఎస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఏయే అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలి

- డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్: గత తొమ్మిది సంవత్సరాల కాలం లో భువనగిరి ఎమ్మెల్యే ఏయే అభివృద్ధి చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధ వారం భువనగిరి పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. రాత్రి కురిసిన వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, మురుగు కాల్వలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కురిసిన వర్షా నికి జంఖాన్‌గూడా చౌరస్తా వద్ద డ్రెయినేజీలో మురుగునీరు నిలిచిపోయిందన్నారు. మున్సిపా లిటీలో ఎలాంటి ప్రణాళిక లేకుండా రోడ్లు, సీసీ డ్రెయినేజీలు నిర్మించడం వల్లే ఈ దుస్థితి ఏర్పడింద న్నారు. అనంతరం భువనగిరి మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యాన్ని కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సరైన సమయంలో ప్రారంభించకపోవడం వల్లే రైతులు నష్టపోయారని ఆరోపించారు. ఆయన వెం ట బీసుకుంట్ల సత్యనారాయణ, తంగళ్లపల్లి రవికు మార్, బర్రె జహంగీర్, ఎండీ మజహర్, గుర్రాల శ్రీనివాస్, సలావుద్దీన్, పచ్చర్ల జగన్, వెంకటేశం, ఎండీ ఈబేద్‌అలీ, శ్రీకాంత్, నర్సింహ ఉన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

భువనగిరి: రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువ చ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కలెక్టర్ పమే లా సత్పతి అన్నారు. పట్టణంలోని హుస్నేబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారం భించారు. ఆమె వెంట పీఏసీఎస్ చైర్మన్ పరమేశ్వర్ రెడ్డి, డీసీఓ పరిమళాదేవి తదితరులున్నారు.



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

రైతుల మెడకు ఉరి తాళ్లు బిగిస్తున్న ప్రభుత్వాలు



ఏఐకేఎంఎస్ జెండాకు వందనం చేస్తున్న నాయకులు

ఆలేరురూరల్: పాలకవర్గాలు రైతుల మెడకు ఉరితాళ్లు బిగిస్తున్నాయని సీపీఐఎంఎల్ న్యూడెమో క్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వర రావు, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, రైతు స్వరాజ వేదిక కన్నెగంటి రవి ఆరోపించారు. రెండో రోజు బుధవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రతినిధుల మహాసభలో వారు మాట్లాడారు. ప్రధాని మోదీ ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో కీలుబొమ్మగా మారి దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సామ్రాజ్యవాదులకు అప్పచెప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ధరణి పేరుతో సంస్కరణలు తెచ్చి భూ యజమానిని రైతుగా గుర్తిస్తున్నారని, సాగు చేసుకునే రైతులను గుర్తించ కుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్ర మంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర నాయ కులు చిట్టిబాబు, వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడాల భిక్షపతి, రాష్ట్ర కార్యదర్శి గొని ఐలయ్య, పూల నాగయ్య, భాస్కర్, సత్య నారాయణ, వెంకటయ్య, బీమన్న గంగారెడ్డి, అధ్య క్షుడు కళ్లెపు అడివయ్య, సోమయ్య, స్వామి, మధు సూదన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బాలమల్లేష్, సర్పంచ్ కట్ట సమరసింహారెడ్డి, సహదేవ్, ముళి, విక్కిరి శ్రీను, ప్రవీణ్, సిద్ధులు, కుమారస్వామి పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ 65పై బ్లాక్‌స్పాట్‌లకు విముక్తి

- రెండు చోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణానికి మోక్షం
- నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం
- కి.మీ 40 నుంచి 221 మధ్యన నిర్మాణాలకు అడుగులు
- రూ.420.26 కోట్ల నిధులకు టెండర్లు ఆహ్వానం
- కేంద్ర రోడ్డు, రవాణా మంత్రిత్వ శాఖ ఆదేశాలు
- ఫలించిన ఎంపీ కోమటిరెడ్డి ప్రయత్నాలు



చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ (ఫైల్)

చౌటుప్పల్ : ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు వారధిగా ఉన్న హైదరాబాద్ – విజయవాడ 65వ నంబరు జాతీయ రహదారి అటు రద్దీలో, ఇటు ప్రమాదాల్లో భారతదేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. గతం లో రెండు వరుసలుగా ఉన్న ఈ రహదారిని 2011సంవత్సరంలో నాలుగు వరుసలుగా నిర్మాణం చేశారు. అయితే అప్పటితో పోలిస్తే ప్రస్తుతం వేలాది వాహనాలు పెరగడంతో రహదారి మరోసారి రద్దీగా మారింది. నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అలా జరిగిన ప్రమాదాల్లో ఇప్పటి వరకు వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో రహదారి నిర్మాణం చేసిన సమయంలో జరిగిన తప్పిదాల కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఆ క్రమంలో ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ, ఎన్‌హెచ్‌ఏఐ, కాంట్రాక్టు సంస్థ జీఎంఆర్ ఉమ్మడిగా కార్యాచరణ రూపొందించాయి. అందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లోని 40.00వ కిలోమీటరు నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా పరిధిలో ఉన్న 221.00వ కిలోమీటరు వరకు బ్లాక్‌స్పాట్‌లను గుర్తించారు. రెండు ప్రాంతాల్లో ఎట్‌గ్రేట్ జంక్షన్‌లను తొలగిం చాలని చాలా కాలం క్రితమే ప్రతిపాదించారు. అలా గుర్తించిన బ్లాక్‌స్పాట్‌ల తొలగింపునకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు, రవాణా మంత్రిత్వ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

తీరనున్న ట్రాఫిక్ సమస్య

ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారి చాలా ఇబ్బం దిగా మారింది. నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోం ది. ఇప్పటి వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్డు లేకపోవడంతో ఇరువైపులా వాహనాలు బారులుదీరి రాకపోకలు సాగిస్తున్నాయి. దీనికి తోడు ఎక్కడ ఏ చిన్న ప్రమాదం జరిగినా గంటల తరబడి వాహనాలు నిలిచిపోవాల్సి వస్తోంది. పం డుగలు, వారాంతపు రోజుల్లో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వీటికి తోడు ఇప్పటికే గుర్తించిన బ్లాక్ స్పాట్‌లు, గ్రామాల జంక్షన్‌ల వద్ద జరుగుతున్న ప్రమాదాల్లో ఎంతో మంది మృత్యువాత పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో వీటన్నింటికీ పరిష్కారం లభించనుంది. అదే విధంగా చౌటుప్పల్ వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో ఎట్‌గ్రేట్ జంక్షన్ తొలగించి అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేయడంతో చౌటుప్పల్ పట్టణ రూపురేఖలు మారనున్నాయి.

ఫలించనున్న ఎంపీ కోమటిరెడ్డి ప్రయత్నాలు

జాతీయ రహదారిపై తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల విషయంలో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేసేవారు. అందులో భాగంగా ప్రమాదాలను నివారించాలన్న సంకల్పంతో చాలా రోజుల నుంచి కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రయత్నాలు ప్రారంభించారు. ఎప్పుడు వీలైతే అప్పుడు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి విన్నవించేవారు. ఇప్పటికే గుర్తించిన బ్లాక్ స్పాట్‌ల పునర్నిర్మాణం, ఎట్ గ్రేట్ జంక్షన్‌ల తొలగింపు చేయాలని కోరారు. ఆ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఆయా పనుల కోసం రూ.420.26 కోట్లు మంజూరు చేసింది. దీంతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రయత్నాలు ఫలించాయి.

గుర్తించిన బ్లాక్ స్పాట్‌లు	అంచనా విలువ (రూ.కోట్లలో)
పెద్దకాపర్తి	29.90
చిట్యాల	42.18
నల్లగొండ క్రాస్‌రోడ్డు, కట్టంగూర్	0.26
కొర్లపహాడ్	5.96
ఎస్‌వీ ఇంజనీరింగ్ కాలేజ్, జనగాం క్రాస్ రోడ్డు	58.04
ఈనాడు ఆఫీస్ ఎదురుగా	27.97
దురాజ్‌పల్లి	2.80
ముకుందాపురం	13.86
ఆకుపాముల	2.16
కొమరబండ ఎక్స్ రోడ్డు	31.01
కట్టకొమ్ముగూడెం	10.89
మేళ్లచెరువు	0.46
శ్రీరంగాపురం	8.50
రామాపురం ఎక్స్‌రోడ్డు	30.26
నవాబుపేట	0.21
మొత్తం	264.84

ఎట్ గ్రేట్ జంక్షన్ తొలగింపు ప్రాంతాలు	
చౌటుప్పల్	114.40
టేకుమట్ల	41.42
మొత్తం	155.42

క్లుప్తంగా

దాడి కేసులో ఏడాది జైలు

తుర్కపల్లి: ప్రభుత్వ అధికారులపై దాడి కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ భువనగిరి కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కపల్లి మండలం ధర్మారం గ్రామ పరిధి కర్ణలగడ్డ తండా వాసుల నీటి అవసరాల కోసం 2018 సంవత్సరంలో అధికారులు బోరు వేస్తున్నారు. ఈ క్రమంలో అదే తండాకు చెందిన గుగులోతు ప్రభాకర్ రెవెన్యూ అధికారులు, పోలీసులపై దాడికి దిగాడు. దీంతో అప్పటి ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి ప్రభాకర్‌పై కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం నిందితుడికి ఏడాది జైలుతో పాటు రూ.1500 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు, జరిమానా

బొమ్మలరామారం : చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ భువనగిరి కోర్టు ప్రిన్సిపాల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నాగేశ్వరరావు తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మలరామారం మండలం యావపూర్ గ్రామానికి చెందిన మూఢావత్ జయరాం కుటుంబం 2022 సంవత్సరం ఆగస్టు 31తేదీన ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. గమనించిన మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ తండా డేరెన్ల దుర్గయ్య ఆ ఇంట్లో చోరీ చేసేందుకు ప్రయత్నించాడు. ఇరుగుపొరుగు వారు గమనించగా పారి పోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. అదే ఏడాది అక్టోబర్ 10న కోర్టులో చార్జిషీట్ వేశారు. విచారణ అనంతరం న్యాయమూర్తి నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్ఐ వెంకన్న, కోర్టు కానిస్టేబుల్ స్వామి, సురేందర్ రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి


అక్షిత (ఫైల్)

వలిగొండ : అనుమానాస్పద స్థితిలో ఓ బాలిక మృతిచెందింది. వలిగొండ మండలం ప్రొద్దుటూరులో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్డెబోయిన గణేశ్, అనిత దంపతుల కుమార్తె అక్షిత (15) మండల కేంద్రంలోని ఓ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తిచేసింది. కాగా, తల్లిదండ్రులు ధాన్యం ఆరబోసేందుకు ఉదయం కొనుగోలు కేంద్రానికి వెళ్లగా అక్షిత ఒంటరిగా ఉంది. మధ్యాహ్నం తండ్రి ఇంటికి రాగా లోపలి నుంచి గడియ వేసి ఉంది. తలుపులు కొట్టినా తీయకపోవడంతో కిటికీ లోంచి చూడగా అక్షిత ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. గణేశ్ లబోదిబోమనడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే అక్షిత మృతిచెందింది. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. అయితే, తమ కుమార్తె మృతిపై అనుమానం ఉందని అక్షిత తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్యామ్ సుందర్ రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడు మృతి

నూతనకల్ : తాటిచెట్టు పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గీత కార్మికుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నూతన్‌కల్ మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామానికి చెందిన ఆలేటి భిక్షం(60) వృత్తిరీత్యా గీత కార్మికుడు. రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం తాడిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో అక్కడినుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

మైనార్టీలకు పథకాలు అందించాలి

- జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది


సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు చిత్రంలో కలెక్టర్, ఎస్పీ తదితరులు

నల్లగొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు మైనార్టీలకు అందించేందుకు కృషిచేయాలని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది అధికారులను కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానమంత్రి నూతన 15సూత్రాల కార్యక్రమం, మైనార్టీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనార్టీలకు వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలపై సమగ్ర సమాచారాన్ని సేకరించి ఒక చిన్న పుస్తకం రూపంలో రూపొందించాలని ఆదేశించారు. షాదీ ముబారక్ పథకం పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని కోరారు. మైనార్టీలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా జిల్లాలో ఎన్ని మైనార్టీ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా మైనార్టీ చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందుతున్న తీరును డీఈఓను అడిగి తెలుసుకున్నారు. వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని రెవెన్యూ, వక్ఫ్ బోర్డు అధికారులను కోరారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇటీవల రంజాన్ పండుగ సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా ఇఫ్తార్ పార్టీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఎస్పీ అపూర్వరావు మాట్లాడుతూ పోలీస్ శాఖ తరపున మైనార్టీలకు రక్షణ కల్పిస్తూ ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం మైనార్టీ ఆధ్యాత్మిక నాయకులు, ఎన్‌జీఓలతో కలెక్టర్ కార్యాలయంలో సమావేశమయ్యారు. తొలుత జిల్లాకు చేరుకున్న జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాదికి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అర్ అండ్‌బీ అతిథి గృహంలో స్వాగతం పలికారు. సమావేశంలో ఆర్‌డీఓ జయ చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణచారి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి గోశిక బాలకృష్ణ, పాల్గొన్నారు.

జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలి పీఏపై దాడి

నల్లగొండ కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం జిల్లా మైనార్టీ నాయకులతో జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది నిర్వహించిన సమావేశంలో ఆమె పీఏ రాజేష్‌కుమార్‌పై ఎంఐఎం నాయకులు దాడి చేశారు. దీంతో సమావేశం అంతా గందరగోళంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లో జిల్లా మైనార్టీ నాయకులతో సమావేశమయ్యారు. సమస్యలపై మాట్లాడేందుకు నాయకులకు అవకాశం ఇచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం మాజీ కౌన్సిలర్ సలీంతోపాటు పలువురు నాయకులు మాట్లాడారు. అయితే సమయం తక్కువగా ఉందని.. సమస్యలు మాత్రమే ప్రస్తావించాలని ఆమె నాయకులకు సూచించారు. ఆ సమయంలో వారి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో సీపీఎం మాజీ కౌన్సిలర్ సలీంను బయటికి పంపించాలంటూ కమిషన్ సభ్యురాలు పోలీసులను ఆదేశించారు. దీంతో అదే సమయంలో సమస్యలు విననప్పుడు సమావేశం ఎందుకని ప్రశ్నిస్తూ.. సభలోని నాయకులంతా ఒక్కసారికి వేదిక వద్దకు వచ్చేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో ఆమె పీఏ రాజేష్‌కుమార్ వారిని అడ్డుకోబోయాడు. పీఏ వద్ద ఉన్న మైక్‌ను నాయకులు లాక్కోవడంతోపాటు చేయి చేసుకున్నారు. దీంతో సభ గందరగోళంగా మారింది. సమావేశాన్ని అర్ధంతరంగా ముగించారు. తన కళ్ల ముందే తన పీఏపై దాడి చేసిన ఎంఐఎం నాయకుడు రజియొద్దీన్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ అపూర్వరావుకు ఫిర్యాదు చేస్తూ ఆ ఫిర్యాదు కాపీని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ఆదిరెడ్డికి అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను మైనార్టీల సమస్యలు తెలుసుకోవడానికి వస్తే దాడి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మైనార్టీ కమిషన్ సభ్యురాలు

థర్మల్ పవర్ ప్లాంట్ కార్మికుడి దారుణ హత్య

- బండరాయితో మోది ఘాతుకం
- ఘటన స్థలాన్ని పరిశీలించిన మిర్యాలగూడ డీఎస్పీ

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామ శివారులోని యాదాద్రి థర్మల్‌పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న ఓ కార్మికుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఝార్ఖండ్ రాష్ట్రం బీశ్వాపూర్ గ్రామానికి చెందిన రఘునందన్‌రామ్(42) పవర్ మేక్ సంస్థలో ఐదేళ్లుగా కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం విధులకు హాజరైన రఘునందన్‌రామ్ రాత్రి నుంచి కనిపించడం లేదు. కాగా, ఉదయం 11గంటల ప్రాంతంలో మండలం వీర్లపాలెం గ్రామ శివారు, పవర్ ప్లాంట్ సమీపంలో రఘునందన్ రామ్ రక్తపు మడుగులో విగతజీవుడిగా పడి ఉండడాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. దుండగులు బండరాయితో మోది హత్య చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. హతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమాచారం మేరకు మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి ఘటన స్థలాన్ని పరిశీలించారు. హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. రఘునందన్‌రామ్‌ను హత్య చేసింది ఎవరు? అందుకు గల కారణాలు ఏమిటీ? తదితర అంశాలపై విచారణ జరపనున్నట్లు డీఎస్పీ తెలిపారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ సత్యనారాయణ, వాడపల్లి ఎస్ఐ రవికుమార్ తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటగిరి

హత్య కేసులో ఒకరికి యావజ్జీవ శిక్ష

- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ

చౌటుప్పల్ : హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ జిల్లా సెషన్ కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. చౌటుప్పల్ మండలప పరిధిలోని తంగడపల్లి గ్రామ శివారులోని ఓ పరిశ్రమలో 2016 సంవత్సరంలో జరిగిన ఈ హత్య ఘటనకు సంబంధించి వివరాలను భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర బుధవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. మండల పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన తిరుమల సురేందర్ గ్రామ శివారులోని డిస్కవరీ పరిశ్రమలో సెక్యూరిటీ ఇంచార్జిగా పని చేసేవాడు. రంగారెడ్డి జిల్లా బాల్‌నగర్‌లోని గాంధీనగర్‌లోని ఐడీపీఎల్ కాలనీలో నివాసం ఉండే భువన్ కుమార్ ఝా(29), అతని సోదరుడు వివేక్ ఝా(25)లు సైతం అదే కంపెనీలో సెక్యూరిటీ గార్డులుగా పని చేసేవారు. డ్యూటీల పంపిణీ విషయంలో అన్నదమ్ములిద్దరికీ సెక్యూరిటీ ఇన్‌చార్జి సురేందర్‌తో గొడవలు జరిగేవి. దీంతో అదే సంవత్సరం మే 8న రాత్రి సమయంలో డ్యూటీలో ఉన్న సురేందర్‌తో గొడవకు దిగారు. కంపెనీ ప్రధాన ద్వారం వద్ద ఉన్న అతనిపై దాడి చేశారు. అదే కోపంతో తలపై బండ రాయితో కొట్టారు. దీంతో తీవ్ర గాయమైన సురేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు విచారణ చేసిన అప్పటి సీఐ నవీన్‌కుమార్ అదే నెల 10వ తేదీన వివేక్‌ఝా అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేశారు. భువన్‌కుమార్ ఝా పరారీలో ఉన్నాడు. విచారణ అనంతరం న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు నిందితుడు వివేక్‌ఝాకు యావజ్జీవ శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారు. కాగా స్థానిక డీసీపీ ఉదయ్‌రెడ్డి, సీఐ మల్లికార్జున్‌రెడ్డిలను డీసీపీ అభినందించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

బీబీనగర్: వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. బీబీనగర్, గుండాల మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ ప్రాంతంలో పటేల్‌నగర్‌కు చెందిన చెందిన మహమ్మద్ ఇనాయత్ చిన్న కూతురు అస్మాథసీన్(26)ను బీబీనగర్‌కు చెందిన మహ్మద్ మునవర్ పాషాతో 15నెలల క్రితం వివాహం జరిగింది. వీరికి 6నెలల పాప ఉంది. కాగా, వివాహ సమయంలో ఒప్పుకున్న ప్రకారం కట్నకానుకలను అప్పగించారు. అయినప్పటికీ భర్తతో పాటు అత్త మామలు అదనపు కట్నం తీసుకురావాలంటూ అస్మాథసీన్‌ను మానసికంగా వేధిస్తూ కొట్టడంతో నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. కుల పెద్దల సమక్షంలో మాట్లాడుకుని అస్మాథసీన్ తిరిగి భర్త ఇంటికి వచ్చింది. మళ్లీ వేధించడంతో మనస్తాపానికి గురైన అస్మాథసీన్ మంగళవారం రాత్రి ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఇనాయత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు..

గుండాల : మండలంలోని వస్తుకొండురు గ్రామానికి చెందిన సింగారం భిక్షం, యాదమ్మల రెండో కుమారుడు సింగారం గణేష్ (22) మద్యానికి బానిసగా మారాడు. మంగళవారం రాత్రి మద్యం తాగి వచ్చి తల్లిదండ్రులపై దాడి చేశాడు. దీంతో వారు వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. బుధవారం ఉదయం తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా గణేశ్ అపస్మారక స్థితిలో ఉన్నాడు. పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడంతో అతడిని జనగామ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి సోదరుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

- తొమ్మిది మంది నిందితుల అరెస్ట్
- రూ.1.12కోట్ల నగదు, రెండు కార్లు, 14సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ అపూర్వరావు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠా గుట్టును నల్లగొండ పోలీసులు రట్టు చేశారు. తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.1.12కోట్ల నగదుతో పాటు రెండు కార్లు, 14సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి ఎస్పీ అపూర్వరావు వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన బంటు రాకేష్ సులువుగా డబ్బు సంపాదించేందుకు మూడేళ్లుగా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. ఇతను టెలిగ్రాం యాప్ ద్వారా హార్దిక్ బుక్కీ ప్యానల్ నుంచి మెయిన్‌లైన్ యాక్సెస్‌ను తీసుకున్నాడు. ఈ లింక్‌ను తన బావమరిది అయిన ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రైల్వేస్టేషన్ రోడ్డులో ఉండే కోల సాయికుమార్‌కు ఫార్వర్డ్ చేశాడు. ఈ లింక్‌లో ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన రాచబంతి జీవన్‌సాయికుమార్, ఇదే జిల్లా కేంద్రంలోని వండర్ కిడ్స్ స్కూల్ సమీపంలోని భక్తపోతన వీధికి చెందిన శాకమూరి ఉదయ్‌కుమార్, ప్రకాష్‌నగర్‌కు చెందిన కొండవేటి రాజేష్, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నామవరానికి చెందిన నోట్ల సత్యనారాయణ, మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన బంటు సంతోష్, షాబునగర్‌కు చెందిన గందం నవీన్‌కుమార్, బంటు వంశీకృష్ణ చేరారు. వీరంతా కొంతకాలంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు.

ఆర్థిక విభేదాలు తలెత్తడంతో..

కొంతకాలంగా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈ ముఠాలో ఆర్థిక లావాదేవీల్లో విభేదాలు తలెత్తాయి. దీంతో అందరూ కలసి ఒకే చోట బెట్టింగ్ చేసేందుకు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ముఠా సూత్రధారి అయిన బంటు రాకేష్‌తో కలిసి మిర్యాలగూడ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని సాయిదత్తా అపార్ట్‌మెంట్‌లో 303 ఫ్లాట్‌లో ఉంటూ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. కాగా, విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు సాయిదత్తా అపార్ట్‌మెంట్‌పై దాడి చేసి వారందరినీ అదుపులోకి తీసుకున్నారని ఎస్పీ వివరించారు. కేసును ఛేదించిన మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, వన్‌టౌన్ సీఐ రాఘవేందర్, ఎస్ఐలు శివతేజ, విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, సిబ్బంది గఫూర్, రవి, రెహమాన్, ఉస్సేన్, వీరబాబు, వెంకటేశ్వర్లు, సైదులును ఎస్పీ అభినందించారు.

దేవరకొండలో ముగ్గురు అరెస్ట్

దేవరకొండ: ఐపీఎల్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురిని బుధవారం అరెస్టు చేసి వారి నుంచి రూ.3.76లక్షల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు దేవరకొండ ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం మీర్జాపూర్‌కు చెందిన శైలేష్‌కుమార్ అగ్రహరి, అదే పట్టణానికి చెందిన హిమాన్షుపటేల్‌లు పట్టణానికి చెందిన పులిజాల శ్రీను ఇంట్లో ఆన్‌లైన్ ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా మంగళవారం రాత్రి పోలీసులు సోదాలు నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. శైలేష్‌కుమార్ అగ్రహరిమూడేళ్లుగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాడని తెలిపారు. తన స్నేహితుడైన హిమాన్షుపటేల్ ద్వారా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐలు సుధీర్‌కుమార్, సతీష్, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, తదితరులున్నారు.

కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం.. బలగం

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం, బలగమని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో బుధవారం ఆలేరు మండలం శారాజీపేటకు చెందిన గౌడ సంఘం అధ్యక్షుడు దూడల లక్ష్మణ్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మొరిగాడి భూచక్రం, దూడల శ్రీను, అంబాల జంగయ్యలతో పాటు మరో 200 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ యాదవ్, సెక్రటరీ జనరల్ రచ్చ రాంనర్సయ్యనేత, మాజీ ఎంపీపీ బెంజారపు రవి, సర్పంచ్ బండ పద్మ పర్వతాలు, రైతు బంధు గ్రామ కన్వీనర్ శనిగరం రవి, గ్రామశాఖ అధ్యక్షుడు బండ మహేందర్, ఉపసర్పంచ్ కంటి మహేందర్, యూత్ నియోజకవర్గ సెక్రటరీ జనరల్ వెంకటేష్ యాదవ్ తదితరులున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

యాదగిరిగుట్ట రూరల్: రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాల్లోనే తమ వడ్లను అమ్ముకోవాలని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని వంగపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, సర్పంచ్ కానుగ కవిత, ఎంపీటీసీ రేపాక మానిక, ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు రేపాక స్వామి, పీఏసీఎస్ డైరెక్టర్‌లు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మహబూబ్‌పేట గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని గొంగిడి మహేందర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరె స్వరూప మల్లేష్ గౌడ్, ఉపసర్పంచ్ పల్లెపాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునితాలక్ష్మారెడ్డి, కుటుంబ సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వ యంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని పూజలు చేశారు. ఆచార్యులు ఆమెకు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయాధికారి రాజు లడ్డూ ప్రసాదం అందజేశారు.


లడ్డూ ప్రసాదం అందజేస్తున్న అధికారి

గుర్తింపు కార్డులు ఇవ్వాలి


మాట్లాడుతున్న రుద్ర పాండురంగ శాస్త్రి

భూదాన్‌పోచంపల్లి : పద్మబ్రాహ్మణ పురోహితులకు ప్రభుత్వం గుర్తింపుకార్డులు ఇవ్వాలని తెలంగాణ పద్మబ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రుద్ర పాండురంగ శాస్త్రి కోరారు. బుధవారం యాదాద్రిలోని పద్మశాలి అన్నసత్రంలో నిర్వహించిన తెలంగాణ పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న పద్మబ్రాహ్మణ పురోహితులందరికీ ఉచిత ప్రమాదబీమా సౌకర్యాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిర్వహించిన ఆగమ పరీక్షల్లో ఉత్తీర్ణులైన పురోహితులను ఆయన అభినందించారు. అంతకుముందు సామూహిక శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్ర స్వాధ్యాయ యజ్ఞక్రతువు నిర్వహించారు.కార్యక్రమంలో అఖిలభారత పద్మబ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షుడు గుర్రం బొజ్జయ్య, యాదాద్రి, శ్రీశైలం, భద్రాచలం పద్మశాలి అన్నసత్రం అధ్యక్షులు చెరిపల్లి యాదగిరి, వర్కాల సత్యనారాయణ, గోశిక యాదగిరి, రచ్చ శ్రీనివాస్, పులగం చక్రపాణి, పురోహితులు ముత్యాలు పాల్గొన్నారు.

వాగులో మునిగి బాలుడు మృతి

మిర్యాలగూడ టౌన్ : వాగులో ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కొండ సరిత-రవి దంపతుల కుమారుడు కొండ గౌతమ్(10) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలకు సెలవులు రావడంతో సాయంత్రం స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలో గల పాలేరు వాగుకు ఈతకు వెళ్లాడు. గౌతమ్ చెక్‌డ్యాం సమీపంలో నీటిలో దిగగా ఈత రాక ఇసుక కోసం తవ్విన గుంతలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. స్నేహితులు గ్రామానికి వెళ్లి విషయం తెలపడంతో కుటుంబ సభ్యులు వచ్చి బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు. గౌతమ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పోస్టాఫీసుల ద్వారా మెరుగైన సేవలు

చౌటుప్పల్ : పోస్టాఫీసుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని హైదరాబాద్ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని దేవలమ్మనాగారం గ్రామంలోని బ్రాంచ్ తపాలా కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆసరా పెన్షన్ కోసం వచ్చిన వృద్ధులు, దివ్యాంగులతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు సంబంధించిన సేవలన్నీ పోస్టాఫీసుల ద్వారా అందిస్తున్నామన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఎన్నో రకాల ఉత్తమమైన స్కీములు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్‌కుమార్ నరహరి, ఉమ్మడి జిల్లా తపాల అధికారి కె.రఘునాథస్వామి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎం.బుచ్చిబాబు, బ్రాంచ్ పోస్టుమాస్టర్ ప్రజాపతి, సిబ్బంది ఉన్నారు.


పెన్షన్‌దారులతో రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తోందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని లక్ష్మీ గార్డెన్‌లో జరిగిన పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యాసంస్థలను బలోపేతం చేయడంతోపాటు పేద, మధ్యతరగతి వారికి ఆంగ్ల విద్యను అందిస్తున్నది ఒక్క తెలంగాణ ప్రభుత్వమే అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి ఉపాధ్యాయులు అండగా ఉండాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పీఆర్‌టీయూ తెలంగాణను అగ్రగామిగా నిలిపే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో పర్యటించి రానున్న ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా భిక్షంగౌడ్‌తోపాటు పెద్ద ఎత్తున ఉపధ్యాయులు పీఆర్‌టీయూ తెలంగాణ సంఘంలో చేరారు. వారికి రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి , సంఘం నాయకులు చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శి శంకర్, భిక్షపతి, భాస్కర్‌గౌడ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


భిక్షంగౌడ్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న సంఘం నాయకులు చిత్రంలో ఎమ్మెల్యే కంచర్ల

పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా 'సుంకరి'

పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుంకరి భిక్షంగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఇప్పటివరకు ప్రధాన కార్యదర్శిగా ఉన్న మారెడ్డి అంజిరెడ్డిని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, మాజీ ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్, జనార్దన్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారు.

'పీఆర్‌టీయూ టీఎస్ పటిష్టంగా ఉంది'

- సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డీవీఎస్ ఫణికుమార్, నారాయణరెడ్డి

నల్లగొండ : పీఆర్‌టీయూ టీఎస్ పటిష్టంగా ఉందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డీవీఎస్ ఫణికుమార్, కాశం నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలో పీఆర్‌టీయూ టీఎస్ బహిష్కృత నేత మరో సంఘంలో చేరడానికి ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించాడని, ఇతర జిల్లాల నుంచి సంఘం బాధ్యులతోపాటు బల నిరూపణ పేరుతో హాస్టళ్ల నుంచి విద్యార్థులను, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను ఇతరులనూ పిలిపించుకుని వారిని పీఆర్‌టీయూ టీఎస్ బాధ్యులుగా వక్రీకరించారని ఆరోపించారు. జిల్లాలో 35 శాఖలకుగాను 33 మండల శాఖలు పీఆర్‌టీయూతోనే ఉంటామని ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి జిల్లా శాఖకు పంపారని తెలిపారు.

కూలిన ధాన్యం బస్తాలు.. హమాలీలకు గాయాలు

పెన్‌పహాడ్ : ధాన్యం బస్తాలు కూలి మీదపడడంతో పలువురు హమాలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని అనంతారం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, కేంద్ర నిర్వాహకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణగూడెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీలు ధాన్యాన్ని కాంటా వేశారు. అనంతరం బస్తాలను లారీలోకి ఎత్తుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కూలి మీద పడడంతో మామిడి వెంకన్న, ఉప్పరి వెంకన్న, భీంపంగి వెంకన్న, కడెం సుందరయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న హమాలీలకు సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆర్థికసాయాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, తహసీల్దార్ శేషగిరిరావు ఉన్నారు.

హమాలీలకు మంత్రి పరామర్శ

గాయపడిన హమాలీలను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆస్పత్రిలో పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.